## సిల్వర్‌జూబ్లీ వేడుకలను విజయవంతం చేస్తాం



తలసానితో సమావేశమైన బీఆర్‌ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ సిల్వర్‌జూబ్లీ వేడుకలను విజయవంతం చేస్తామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేపట్టి చలో వరంగల్ సిల్వర్‌జూబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తామన్నారు.

## విద్యార్థులు కళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గోల్కొండ: విద్యార్థులు కళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి అన్నారు. ఎక్సెస్ ఫౌండేషన్ వారు గోల్కొండ హెల్త్ క్లబ్ సౌజన్యంతో మంగళవారం కళాశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి జబ్బులపై అత్యంత జాగ్రత్తగా ఉండాలని కంటి చూపు పోతే జీవితాంతం అంధకారంలో ఉండాల్సి వస్తుందన్నారు. కాగా ఎక్సెస్ ఫౌండేషన్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా కళ్లద్దాలు ఇస్తున్నారని, కాటరాక్ట్ శస్త్ర చికిత్స కూడా ఉచితంగానే చేస్తారన్నారు.

## రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న బీఎం.వినోద్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: మనల్ని రక్షించాల్సిన రాజ్యాంగాన్ని మనం పరిరక్షించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఐఎఫ్ఎస్ అంబాసిడర్ డాక్టర్ బీఎం.వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం సైఫాబాద్‌లోని అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ–భవిష్యత్ ప్రణాళిక'అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మేధావులు, సంఘాలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్దంగా నడుచుకొని ఎవరి వాటా వారికి అందజేయాలని, హెచ్చుతగ్గులను పారదోలి రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరారు. ఆంధ్ర మహిళా సభ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వసుంధరదేవి మాట్లాడుతూ.. సమాజంలో కులమత వర్గ విభేదాలు లేకుండా శాంతిభద్రతలతో ఉండాలంటే రాజ్యాంగం అమలవ్వడం ఒక్కటే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, ప్రొఫెసర్ రజిత, డాక్టర్ సాధన పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ హత్య



మహ్మద్ అస్లాం(ఫైల్)

సంతోష్‌నగర్: ఓ ఆటో డ్రైవర్ హత్యకు గురైన ఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట బండ్లగూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ అస్లాం (22) ఆటోడ్రైవర్. ఈ నెల 7న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన అస్లాం రాత్రైనా రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం సంతోష్‌నగర్‌లోని డీబీషా దర్గా సమీపంలోని శ్మశాన వాటికలో మహ్మద్ అస్లాం రక్తపు మడుగులో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అస్లాం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. తన కుమారుడు మృతికి ఫైజల్ అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు తల్లి రెహానా బేగం ఫిర్యాదులో పేర్కొంది.

# బిరుదురాజు రామరాజు | సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

సుల్తాన్‌బజార్: విద్యార్థి దశలో నిజాం వ్యతిరేక పోరాట యోధుడిగా, దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి జానపద విజ్ఞాన పరిశోధకుడిగా, తెలుగు ఆచార్యులుగా ఆచార్య బిరుదురాజు రామరాజు చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కీర్తించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం పరిషత్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఆచార్య బిరుదు రాజు రామరాజు శతజయంతి ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ..రామరాజు తమకు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో స్నాతకోత్సర స్థాయిలో పాఠాలు బోధించారని గుర్తుచేసుకున్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి జీవితం, సాహిత్యం అనే అంశంపై పరిశోధన సాగించి అందించిన పుస్తకం చదివి మెచ్చుకున్నారన్నారు. వక్తగా పాల్గొన్న శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం కార్యదర్శి టి.ఉదయవర్లు మాట్లాడుతూ..రామరాజు గొప్ప పరిశోధకులుగా, అధ్యాపకులుగా, అనేక సంస్కృత, తెలుగు ప్రాచీన గ్రంథాల అన్వేషణ, పరిష్కరణ కర్తగా అందించిన సేవలు బహుముఖీనమైనవని తెలిపారు. రామరాజు మనుమరాలు, తెలుగు విశ్వవిద్యాలయ నృత్య శాఖ అధ్యక్షురాలు డాక్టర్ కె.రత్నశ్రీ మాట్లాడుతూ..తాత డాక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి తొలినాళ్లలో కవితలు అందించి రామనారాయణ కవులలో ఒకరుగా పేరొందారన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి సూచనపై రాజకీయాలను, ఇతర రంగాలను వదిలి తెలుగు ఆచార్యులుగా, పరిశోధకులుగా కొనసాగారని తెలిపారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ.సిల్మానాయక్ సమావేశ కర్తగా వ్యవహరించారు.

## సెట్విన్ శిక్షణ కేంద్రాలను సందర్శించిన పరకాల ఎమ్మెల్యే



యాకుత్‌పురా: సెట్విన్ శిక్షణ సంస్థను రాష్ట్ర వ్యాప్తంగా మరింత విస్తరించేందుకు తమవంతు సహకారం అందిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. నగరంలోని సెట్విన్ శిక్షణ సంస్థ కేంద్రాలను మంగళవారం ఆయన సంస్థ ఎండీ వేణుగోపాల్‌రావుతో కలిసి సందర్శించారు. పురానిహవేలీ, మోతీగల్లీ, సీతాఫల్‌మండిలోని శిక్షణ కేంద్రాలను సందర్శించి అక్కడ అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సిబ్బందితో ఆరా తీశారు. సెట్విన్ నిర్వహిస్తున్న సేవలను ఎండీ వేణుగోపాల్ రావు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సెట్విన్ ట్రయినింగ్ ఇన్‌చార్జి నవీన్‌కుమార్, శిక్షణ కేంద్రాల ఇన్‌చార్జీలు వెంకటేశ్వర్లు, అనిత, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేడ్కర్, పూలే ఆలోచనలు స్ఫూర్తిదాయకం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఎంఎల్. ఆనందరావు, డాక్టర్ ప్రీతి సంయుక్త

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం డాక్టర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనా విధానంపై ఆర్ట్ క్యాంప్, ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంఎల్.ఆనంద్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్, పూలే ఆశయాలు, ఆలోచనలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పెయింటింగ్ విభాగాధిపతి డాక్టర్ ప్రీతి సంయుక్త, ఆనంద్‌గడప, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ గుర్రం మేల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు



పట్టాభిషేకంలో రాహుల్‌దాస్‌బాబా, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తదితరులు

లంగర్‌హౌస్: అపురూప దృశ్యం రాజతిలకం భక్తులను మైమరపింపజేసింది. లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిని మఠ ఆలయం జానకీ సమేత వీరవెంకట విజయరాఘవస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. రాత్రికి రాములోరికి పట్టాభిషేకం, రాజతిలకం కార్యక్రమాలు పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వేద పండితులు రాజనర్సిహ్మాచారి చేతుల మీదుగా అపురూపంగా జరిగాయి. రాజతిలకంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ ఉత్సవాల్లో సాయిటెక్ పెయింట్స్ ముత్యాల శేఖర్‌బాబు, అత్తాపురం గణేష్, లింగారెడ్డి, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్, చంటిబాబు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ నగేష్‌లు పాల్గొన్నారు.

## సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

యాకుత్‌పురా: న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అందుబాటులోకి తీసుకురావాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఏ.ఎస్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.అజయ్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లో న్యాయవాది మహ్మద్ ముస్తాఫా అలీపై జరిగిన దాడిని నిరసిస్తూ పురానిహవేలీలోని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టులోని న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు తిరిగి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



పట్టాలు అందుకున్న విద్యార్థులు

## ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

విజయనగర్‌కాలనీ: పాఠశాల స్థాయిలోనే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధనకు కృషి చేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ పూనం అన్నారు. మంగళవారం ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలలో పీపీ–2, 5వ తరగతి నుంచి 6వ తరగతికి ప్రమోట్ అయిన విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా పూనం, విద్యావేత్త శ్రీనివాస్‌రెడ్డి హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శశికళ, ప్రైమరీ స్కూల్ కో ఆర్డినేటర్ ఫర్హానా, ప్రైమరి వైస్ ప్రిన్సిపాల్ సనా ప్రీ ప్రైమరీ కో ఆర్డినేటర్ రష్మిక తదితరులు పాల్గొన్నారు.

## నియామకం



రవికుమార్

గన్‌ఫౌండ్రీ: జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా కో ఆర్డినేటర్‌గా కె.రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రవీంద్రభారతిలో నేషనల్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఒక గాయకుడిగా రానిస్తున్న తనకు ఇటువంటి అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బుక్ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 11న రౌండ్ టేబుల్ సమావేశం



బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: ఈ నెల 11న నియోజకవర్గాల పునర్విభజన అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడిస్తారని తెలిపారు.

## ఇందిరాపార్కు వద్ద దీక్షలో పాతబస్తీ బీఆర్‌ఎస్ నేతలు



దీక్షలో పాల్గొన్న ఆకుల శ్రీనివాస్

చాంద్రాయణగుట్ట: తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని పెట్టాలని ఇందిరాపార్కు వద్ద జరిగిన జ్యోతిబాపూలే సాధన సమితి సాధన దీక్షలో చాంద్రాయణగుట్ట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, బడుగు, బలహీన వర్గాల నాయకుడు ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం, మహిళల్లో చదువుకోవాలని పాఠశాలలను స్థాపించి అణగారిన వర్గాల కోసం ఆహర్నిషలు కృషి చేసిన మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఆవిష్కరించి భావితరాలకు పూలే ఆశయాలను కొనసాగించాలని లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో పుట్టగతులుండవన్నారు. బడుగు, బలహీన వర్గాల ఐక్యమత్యంతో రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేసి సాధించుకుంటామన్నారు. ఇందిరాపార్కు వద్ద పూలే విగ్రహ సాధన ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో జరిగిన దీక్షలో ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేటి నుంచి భవానీమాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని కమాన్ మిథిలానగర్ రోడ్డులో కొలువుదీరిన శ్రీభవానీ శంకర గణపతి భక్త ఆంజనేయస్వామి సహిత నవగ్రహ ఆలయంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు శ్రీ భవానీ (పార్వతి) అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 11న శివపార్వతి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. రోజూ అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



డబీర్‌పురా: కోమటివాడిలోని రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగిన మరుసటి రోజు సందర్భంగా మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఆర్య వైశ్య సంఘం సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు బొంగులూరి రాంమూర్తి శాస్త్రి, బొంగులూరి శ్రీను శాస్త్రి, బొంగులూరి విశ్వం శాస్త్రిల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమ్మిళిత ప్రగతిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఆచార్య శ్రీనివాసరెడ్డి

చార్మినార్: ప్రజాస్వామ్యం ఇంకా గగన కుసుమంగానే ఉందని అరోరా బిజినెస్ స్కూల్ డీన్ ఆచార్య శ్రీనివాసరెడ్డి అన్నారు. సిటీ కాలేజి పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు ఐసీఎస్ఎస్ఆర్ సహకారంతో క్షేత్ర స్థాయిలో మహిళల నాయకత్వం–సమగ్ర అభివృద్ధి, ప్రభావవంతమైన పాలన, లింగ సమానత్వంపై ప్రభావం, సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమ్మిళిత ప్రగతిపై అందరూ దృష్టి సారించాలన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న పీర్జాదిగూడా కార్పొరేటర్ స్వాతి గౌడ్ మాట్లాడుతూ..గతంలో కంటే సమకాలీన సమాజంలో మహిళల పాత్ర పెరుగుతున్నదన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు వెంకటేష్ మాట్లాడుతూ..స్థానిక సంస్థల నుంచి పార్లమెంటు వరకు మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరిగితేనే సామాజిక ప్రగతి వేగవంతమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ..ఈ కాలానికి అవసరమైన, ప్రాసంగికత కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ తిరుపతి, భాస్కర్, శంకర్కుమార్, శాంతి, శ్రీనివాస్, సుదక్షణ, భూపాల్, శ్రీశైలం పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పార్టీ అధిష్ఠానం మేరకు ఆయన కిసాన్ మోర్చా నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిసాన్ మోర్చా బృందాలు వర్షాలతో పంటలు దెబ్బతిన్న ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, మెదక్, ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటిస్తుందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని దెబ్బతిన్న ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే తాము ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు సరైన ధర ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు.

## ఆరోగ్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం



వాక్ ఫర్ ఎ హెల్తీ బిగినింగ్‌లో పాల్గొన్న ప్రముఖులు

చార్మినార్: ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రకాల అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ డీజీపీ అన్వర్ ఉల్ హుదా అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నాంపల్లిలోని కేర్ హాస్పిటల్స్ 'వాక్ ఫర్ ఎ హెల్తీ బిగినింగ్'ను చార్మినార్ వద్ద నిర్వహించింది. ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో, ఆరోగ్యంగా ఉండేందుకు ఏం చేయాలో చెప్పడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఆస్పత్రి యాజమాన్యం ప్రకటించింది. ఈ సందర్భంగా అన్వర్ ఉల్ హుదా మాట్లాడుతూ.. కేర్ హాస్పిటల్స్ యాజమాన్యం ఆరోగ్యంపై మంచి అవగాహన కలిగిస్తోందన్నారు. ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్ తమ కొత్త మెంబర్‌షిప్ కార్డ్ 'సంగం'ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ మాజీ డీసీపీ కె.బాబురావు, కార్పొరేటర్ సయ్యద్ సుహైల్ ఖాద్రీ, నాంపల్లి కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సమీ, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అమన్ సల్వాన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్, అనస్తీషియా నిపుణుడు డాక్టర్ ఇర్ఫాన్, సేల్స్, మార్కెటింగ్ హెడ్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## అధికారులు మరింత క్రియాశీలకంగా పని చేయాలి



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు మరింత క్రియాశీలకంగా పని చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ కాకతీయనగర్ కాలనీలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాఖల పనితీరుపై సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని ఎన్నో ప్రాంతాల్లో డిసిల్టింగ్ పనులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఎస్‌పీ–2, 3 పనులు ఇంకా పూర్తి కాలేదని, రోడ్లకు మరమ్మతులు కూడా పూర్తి కాలేదన్నారు. అదే విధంగా ప్రజలకు తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని నల్లాల్లో వస్తున్న నీరు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చలేకపోతుందన్నారు. బస్తీలు, కాలనీల్లో వెలగని వీధి దీపాలు ఎన్నో ఉన్నాయన్నారు. వాటికి మరమ్మ తు లు చేసి కొత్త విద్యుత్ దీపాలు అమర్చాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా పాతకాలం నాటి డ్రైనేజీలు ఉన్నాయని పైప్‌లైన్‌లు పూర్తిగా ధ్వంసమై మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. అదే విధంగా బస్తీలు, కాలనీల నుంచి రాత్రి సమయంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని టోలిచౌకీ నుంచి లంగర్‌హౌస్ వెళ్లే వారు ఎండీ లైన్స్ రోడ్డు మీదుగా వెళ్తున్నారని ఈ కారణంగా బస్తీల అంతర్గత రోడ్లల్లో సైతం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బల్దియా ఈఈ వెంకట శేషయ్య, ఏఈ ఉదయ్, జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదరంగంపై ఆసక్తి పెంచాలి



వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులతో సురేష్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చదరంగంపై ఆసక్తి పెంచాలని నెక్స్ట్ గెలిరియా మాల్ సెంటర్ హెడ్ పి.సురేష్ అన్నారు. ప్రగతి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 15, 11, 9 చెస్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చదరంగం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. అనంతరం వివిధ రంగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చెస్ అకాడమి నిర్వాహకులు పాల్గొన్నారు.